ప్రజాశక్తి
ఆదివారం 21 జనవరి 2024
5
విజయనగరం

10 మంది ఎస్ఇబి ఎస్ఐల బదిలీ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో విభాగంలో వివిధ సబ్‌స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న 10 మందిని రాష్ట్ర స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో కమిషనర్ ఆదేశాల మేరకు వివిధ స్టేషన్లకు బదిలీ చేస్తూ జిల్లా ఎస్ఇబి అధికారి ఎస్.వెంకటరావు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు ప్రస్తుతం పనిచేస్తున్న స్టేషన్‌లో రిలీవ్ కావాలని, కొత్త పోస్టింగ్‌ల్లో తక్షణమే జాయిన్ కావాలని పేర్కొన్నారు. బదిలీ అయిన వారిలో బి.మధుకుమార్ (విజయనగరం1), పి.రామచంద్రకుమార్ (విజయనగరం 2), ఎంఆర్‌వి అప్పారావు (భోగాపురం), పి. ఉమామహేశ్వరరావు (చీపురుపల్లి), జిఎస్ రాజశేఖర్‌నాయుడు (నెల్లిమర్ల), ఎం.విజయలక్ష్మి (గజపతినగరం), ఎస్.ధర్మారావు (ఎస్.కోట), సిహెచ్ రాజేశ్వరి (కొత్తవలస), ఆర్.జైభీమ్ (బొబ్బిలి), వివిఎస్ఎస్ శేఖర్‌బాబు (విజయనగరం ఇంటెలిజెన్స్ వింగ్) ఉన్నారు.

సడలని సంకల్పం

- మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతున్న అంగన్వాడీలు
- 40వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె
- మద్దతుగా కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన రాస్తారోకోలు

విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద రహదారిపై రాస్తారోకో చేస్తున్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన జిల్లాలో నిరవధిక సమ్మె చేపట్టిన అంగన్వాడీలు అదే సంకల్పాన్ని కొనసాగిస్తున్నారు. 40 రోజులుగా మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతున్నారు. అంగన్వాడీలకు మద్దతుగా శనివారం జిల్లాలో పలుచోట్ల ప్రజా సంఘాల ఆధ్వర్యాన రాస్తారోకోలు నిర్వహించారు. అంగన్వాడీల సమ్మె శనివారం 40వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో విజయనగరంలో కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద 40 అంకె రూపంలో కూర్చుని నిరసన తెలిపారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్, సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీలకు మద్దతుగా కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద రాస్తారోకో నిర్వహించారు. 40 రోజులుగా అంగన్వాడీలు పోరాటం చేస్తుంటే వారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకుండా కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కారమయ్యే వరకూ అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రంగరాజు, ప్రధాకార్యదర్శి బి.అశోక్, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శి బి.రమణ, ఎ.జగన్మోహన్, నాయకులు రెడ్డి శంకర్రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రాము, వెంకటేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు హరీష్, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : గజపతినగరం జంక్షన్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యాన రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు హరికృష్ణ వేణి, అంగన్వాడీ యూనియన్ నాయకులు నారాయణమ్మ, రాములమ్మ, త్రివేణి, నాగమణి, జ్యోతి, సుజాత, సన్యాసమ్మ, రమణమ్మ, నరసమ్మ, దమయంతి పాల్గొన్నారు. అంగన్వాడీలకు యుటిఎఫ్ జిల్లా నాయకులు భాస్కరరావు, అల్లు శంకరరావు, ఆరిశెట్టి రవి, లంక జగదీష్, జివి నారాయణ మద్దతు తెలిపారు.

శృంగవరపుకోట : అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్, జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ జగన్ సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు డి.శ్యామల, డి.జయలక్ష్మి, వి.మాణిక్యం, కె.సుశీల పాల్గొన్నారు.

బొబ్బిలి : అంగన్వాడీలకు మద్దతుగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బలిజిపేట రోడ్డులో స్టైల్ బజారు వద్ద రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఎఐటియుసి జిల్లా నాయకులు ఎం.శ్రీనివాస్, అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, ఉమాగౌరి, నిర్మల, పద్మ పాల్గొన్నారు.

జామి : జామిలో భారీ ఎత్తున అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. తొలుత తహశీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. వీరికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కనకమహాలక్ష్మి, కృష్ణమ్మ, సిఐటియు నాయకులు గాడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జామి : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

భోగాపురం : భోగాపురంలో అంగన్వాడీలు భారీ ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. తొలుత తహశీల్దార్ కార్యాలయం నుంచి ముక్కాం జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూర్యనారాయణ, యూనియన్ నాయకులు కృష్ణవేణి, అనిత, శ్రీదేవి, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. సిఐ బి.వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు సూర్యకుమారి, బాలకృష్ణ, రాము గణేష్ సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు.

గజపతినగరం, బొబ్బిలి, భోగాపురంలో రాస్తారోకోలు నిర్వహిస్తున్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, అంగన్వాడీలు

జాతీయ సైన్సు ఫెస్ట్‌లో పాల్గొన్న చీపురుపల్లి విద్యార్థులు, ఉపాధ్యాయులు కృష్ణారావు

జాతీయ సైన్సుఫెస్ట్‌లో చీపురుపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఈనెల 17నుండి 20 వరకు కేంద్ర ప్రభుత్వం, కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ, కేంద్ర అంతరిక్ష పరిశోధనా శాఖ, విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో హరియానాలో నిర్వహించిన అంతర్జాతీయ ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు చీపురుపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. భౌతిక శాస్త్రం,జీవశాస్త్రం,గణిత శాస్త్రంపై జరిగిన జాతీయ స్థాయి వర్క్ షాప్‌లో 9వ తరగతి విద్యార్థులు జెఎస్. శ్రీవిద్య, యంఆర్ గాయత్రి దేవి, యన్.సుప్రియ డి.పార్థసారథి, టివియం సూరజ్ పాల్గొన్నారు. వీరికి జీవశాస్త్ర ఉపాధ్యాయులు మిరియాల కృష్ణారావు గైడ్‌గా వ్యవహరించారు. ఈ వర్క్ షాప్‌లో 'ఫోల్డ్ స్కోప్' సొంతంగా తయారు చేసి ఫెర్న్‌రైజోంను ఈ ఫోల్డ్‌స్కోప్‌తో పరిశీలించారు. పలు జాతీయ సంస్థలు ఏర్పాటు చేసిన మెగా ఎక్స్‌పోలను పరిశీలించారు. అంతర్జాతీయ శాస్త్ర పరిశోధనలను తిలకించారు.

27న భీమిలిలో వైసిపి బహిరంగ సభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ఈనెల 27న విశాఖ జిల్లా భీమిలిలో ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి నాయకులు, కార్యకర్తలతో భారీ సభ జరగనుందని , ఈ సభకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హాజరు కానున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సిఎం జగన్ మోహన్ రెడ్డి వైసిపి నాయకులు, కార్యకర్తలతో రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో సభలు ఏర్పాటు చేసి ఎన్నికల శంఖారావం పూరిస్తారని తెలిపారు. మొదటిగా ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఈనెల 27న భారీ బహిరంగ సభ ద్వారా దిశా నిర్దేశం చేయనున్నారన్నారు. ఈ సభకు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరు కావాలని తెలిపారు.

సభను జయప్రదం చేయండి : కోలగట్ల

భీమిలిలో జరిగే సభను విజయవంతం చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, నియోజకవర్గ పరిశీలకులు డోల జగన్ కోరారు. నియోజకవర్గ విస్తత స్థాయి సమావేశాన్ని శనివారం కోలగట్ల నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ ఈ సభకు పార్టీ శ్రేణులు నిర్దేశించిన పదవులలో ఉన్న వ్యక్తులు హాజరుకావాలని కోరారు. ఒక్కొక్క నియోజకవర్గ నుంచి ఐదు నుండి పదివేల మంది తరలి వస్తారన్న అంచనాలను వేస్తున్నామన్నారు. 21వ తేదీన నగరంలోని మార్కెట్ ప్రాంతంలో భావసాగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు చెప్పారు. 28వ తేదీన కోడి రామమూర్తి విగ్రహాన్ని, 30వ తేదీన ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ వద్ద గాంధీ విగ్రహాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 15న చిల్డ్రన్ పార్క్‌ను, ఉడా రహదారిని ప్రారంభించేందుకు యోచిస్తున్నామని తెలిపారు.

రైళ్ల రద్దుతో బస్సులకు రద్దీ

ప్రజాశక్తి - విజయనగరం కోట

సంక్రాంతి పండగ ముగియడంతో పండగకు వచ్చే ప్రతి ఒక్కరూ తిరిగి తమ పిల్లా పాపలతో తమ స్వగ్రామాలకు, వలస ప్రాంతాలకు పయణమయ్యారు. పార్వతీపురం మీదుగా వెళ్లే ట్రైన్‌లు మూడో లైను ట్రాక్ నిర్మాణంలో భాగంగా రద్దు కావడంతో ప్రయాణికులు బస్సులను ఆశ్రయించాల్సి వచ్చింది. గుంటూరు-రాయగడ రైలు విజయనగరం వరకే నడపడంతో పార్వతీపురం, బొబ్బిలి, రాయగడవైపు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీరంతా బస్సుల్లో వెళ్లేందుకు ఆర్‌టిసి బస్టాండ్‌కు చేరుకోగా,బస్సులు సైతం సరిపడా లేకపోవడంతో తమ గమ్య స్థానాలకు చేరుకునేందుకు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

కలెక్టర్ నాగలక్ష్మి ● రహదారి భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కృషి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను శనివారం ప్రారంభించారు. దీనికి సంబంధించిన గోడ పత్రికలను, కరపత్రాలను తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 19 వరకు రహదార భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రహదారి భద్రతా నియమాల పట్ల విస్తత అవగాహన కల్పించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను కొంతవరకు నివారించవచ్చునని సూచించారు. దీనిలో భాగంగా వివిధ వర్గాల వారికి, యువతకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ జి.ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ, మాసోత్సవాల షెడ్యూల్‌ను వివరించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో ప్రతీఏటా రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహించి, అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎవి రమణ, యు.దుర్గాప్రసాద్, కె.రవిశంకర్ ప్రసాద్, సహాయ మోటార్ ఇన్‌స్పెక్టర్లు వి.శ్రావ్య, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, డిటిసి రవీంద్రనాథ్, తదితరులు

ఆడపిల్లలను కాపాడండి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-విజయనగరం కోట

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

ఆడపిల్లలను చిదిమేయవద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్. భాస్కరరావు కోరారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిరోధక చట్టంపై తమ కార్యాలయంలో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండల, డివిజన్, జిల్లా స్థాయిలో వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన డిఎంహెచ్ఒ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు వైద్య శాఖ అధికారి డాక్టర్ కె. రాణి, నోడల్ అధికారి డాక్టర్ ఆర్. అచ్యుత కుమారి, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. సూర్యనారాయణ, పిఒ ఎన్‌సిడి డాక్టర్ రవికుమార్, డిఇఎంఒ చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు.

అత్యాచారం కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అత్యాచారం, కులదూషణ కేసులో ముద్దాయికి పదేళ్లు కఠిన కారాగార శిక్ష, రూ. 10వేలు జరిమానా న్యాయస్థానం విధించినట్టు ఎస్‌పి విక్రాంత్ పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు వివరాలను ఎస్‌పి వెల్లడించారు. గంగాపురానికి చెందిన వివాహిత.. భర్త తాగుడుకు బానిస కావడంతో తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది. అదే గ్రామానికి చెందిన పిరిడి ఆమెను మోసగించి, గర్భిణిని చేశాడు. ఆమెకు అబ్బాయి పుట్టగా, నిందితుడు గ్రామం విడిచి పరారయ్యాడు. ఆయనపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టగా నేరం రుజువైంది. దీంతో పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

'చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు'

ప్రజాశక్తి-విజయనగరం కోట

చంద్రబాబు తోనే రాష్ట్ర భవిష్యత్తు అని విజయనగరం నియోజకవర్గం అతిథి గజపతిరాజు అన్నారు.బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం విజయనగరం 2వ, 3వ డివిజన్ పూల్ బాగ్ కాలనీలో నియోజకవర్గ ఇంచార్జ్ పూసపాటి అదితి గజపతిరాజు ఇంటింటి ప్రచారం నిర్వహించి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన హామీలను ప్రజలకు వివరించారు, ఆమెకు మహిళలు పెద్ద ఎత్తున హారతి ఇచ్చి తిలకం దిద్దారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని కాపాడాలంటే టిడిపి - జనసేన ప్రభుత్వం ఏర్పడాలని, అందుకు ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజు కుటుంబానికి అశోక్ పరామర్శ

ఈనెల 12న మృతి చెందిన జమ్ము గ్రామ మాజీ సర్పంచ్ గంటా రాజు (జమ్ము రాజు) కుటుంబ సభ్యులను శనివారం టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు ఉన్నారు.

రాజు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు

విగ్రహావిష్కరణలు ఎవరి కోసం?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఏ నినాదం వెనుక ఎవరి ప్రయోజనం దాగివుందో తెలుసుకోలేనంత కాలం జనం మోసపోతూ ఉంటారని లెనిన్ మహాశయుడు శతాబ్ధకాలం క్రితమే ఉద్భోదించాడు. నేడు ఆయన మాటలను గుర్తుచేస్తున్నారు చాలా మంది ప్రజా దృక్కోణంగల రాజకీయ విశ్లేషకులు, మేథావులు, ప్రజాసంఘాల నాయకులు. ఇందుకు కారణం లేకపోలేదు. ఇటీవల జిల్లాలో అంబేద్కర్ విగ్రహాలకు పాలాభిషేకాలు, పూలదండల అలంకరణ కాస్తా ఎక్కువైంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు మునుపెన్నడూ లేనంతగా హడావుడి చేస్తున్నాయి. వైసిపి అయితే రాష్ట్ర రాజధానిలో రూ.4వందల కోట్లతో పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేసి, దాన్ని ఆవిష్కరించింది. బహుశా అందుకేనేమో ఆ పార్టీ జిల్లాలో కూడా కొద్ది రోజులుగా అటువంటి హడావుడి చేస్తోంది. మేమేం తక్కువ కాదన్నట్టు టిడిపి కూడా తన వంతు కార్యక్రమాలు ముమ్మరం చేస్తోంది. అంతమాత్రాన దీనికి రాజకీయ రంగు పులిమేయాలా అనుకుంటే పొరపాటే. కానీ, దశాబ్దాలు తరబడి రాష్ట్రాన్ని ఏలిన అధికార, ప్రతిపక్ష పార్టీలు అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు, అమలుకు ఏమేరకు ప్రయత్నిస్తున్నాయన్నదానిపై మాత్రం సర్వత్రా చర్చనడుస్తోంది. వాస్తవానికి అంబేద్కర్‌ను గుర్తు చేసుకుంటే అందులో మూల స్తంభాలుగావున్న ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, సమైక్యవాదం, దేశ ఆర్థిక స్వావలంభన ఎవరికైనా గుర్తుకు రాకమానవు. కానీ, వాటి అమలు మన జిల్లాలో ఏమేరకు అమలవుతోంది. ఇప్పటికీ అంటరానితనం వెంటాడుతోంది. జిల్లాలో రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతోంది. చదువు, విద్యలో ఇంకా వెనుకబాటు ఉంది. అంతెందుకు ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్లు ఉన్నప్పటికీ తీరా ఎన్నికయ్యాక ప్రజాప్రతినిధిగా తన అధికారాన్ని ఉపయోగించుకునే స్వేచ్ఛగానీ, బాధ్యతలు నెరవేర్చగలిగే అవకాశంగా ఉందా? అని జనం



చర్చించుకుంటున్నారు. ఇదే జరిగి ఉండి వుంటే గిరిజన గ్రామాలు కనీసం రహదారులకు కూడా ఎందుకు నోచుకోలేదు. నిన్నగాక మొన్న ఎస్.కోట ఏజెన్సీలో దారిలేక డోలిమోతతో సర్కారు దవాఖానాకు ఎందుకు వెళ్లాల్సివచ్చింది. మార్గం మధ్యలో ప్రాణం పోతే, చివరికి మృతదేహాన్నిమోటార్ సైకిల్‌పై ఎందుకు తీసుకెళాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణాల్లో సైతం దళితులు ఇంకా ఎందుకు మురికివాడల్లో మగ్గాల్సిన దుస్థితి ఏర్పడింది. అంబేద్కర్ చూపిన స్వేచ్ఛ, సమానత్వం పాలకపార్టీలు అమలు చేసి ఉంటే ఈ దుస్థితి ఏర్పడేదా? అన్నది పబ్లిక్ టాక్. ఈ మాట కొస్తే దేశంలోని బిజెపి ప్రభుత్వం మత కలహాలు సృష్టిస్తోందని, మత ప్రాతిపదికన జనాన్ని విభజిస్తోందని అనేక మంది మేథావులు, రాజకీయ పార్టీలు అంటున్నారు. అటువంటి ప్రయత్నం మన రాష్ట్రంలోనూ జరుగుతోంది. ముఖ్యంగా నూతన విద్యావిధానం పేరిట చేసిన సిలబస్ మార్పులో మతాన్ని పులుముతూ జాతీయవాదాన్ని దెబ్బతీసే అనేక అంశాలు చేర్చినట్టుగా మేథావులు విమర్శిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఈ విధానాన్ని అమలు చేసేందుకు కేరళ సహా చాలా రాష్ట్రాలు నిరాకరించాయి. కానీ, మన రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అంత ఊవ్వెళ్లూగుతూ ఈ విధానం అమలు చేస్తోంది. టిడిపి ఎందుకు ప్రయత్నం చేయడం లేదు. దేశ ఆర్థిక స్వాలంభన దెబ్బతీసే విధంగా విశాఖ ఉక్కును విదేశీ కంపెనీకీ, విశాఖపోర్టును ఆదాని వంటి గుత్తపెట్టుబడిదారులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తే వైసిపి ప్రభుత్వం ఎందుకు మాట్లాడడం లేదు. ప్రతిపక్ష టిడిపి ఎందుకు నోరు మొదపడం లేదు. ఇవన్నీ జనం నోట నుంచి వినిపిస్తున్న మాటలు. ఈనేపథ్యంలో రానున్న ఎన్నికల్లో ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడినవారిని ఓటు బ్యాంకుగా మార్చుకునేందుకే వైసిపి ప్రయత్నిస్తోందని, అందుకు ప్రతిపక్ష టిడిపి కూడా పోటీ పడడం తప్ప, జాతి సమగ్రతను కాపాడి, పేదరిక నిర్మూలన, స్వేచ్ఛ, సమానత్వం కోసం ప్రయత్నించడం లేదని ప్రజానీకంలో చర్చ జరుగుతోంది.

పెండింగ్‌లో వసతి గృహాల డైట్ బిల్లులు

మెనూ అమలు కోసం హెచ్‌డబ్ల్యుఒల అప్పులు ● బిల్లుల కోసం ఎదురు చూపులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం సక్షేమ వసతి గృహాల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. మెనూ బిల్లులు చెల్లించకపోవటంతో సంక్షేమ వసతి గృహ అధికారులు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెట్టాల్సిన దుస్థితి నెలకుంది. చేసిన అప్పులు తీర్చేమార్గం లేకపోవటం, కొత్త అప్పులు పుట్టకపోవటతో గత్యంతరం లేక వారి బంగారు వస్తువులను బ్యాంకుల్లో కుదువబెట్టి మెనూను అమలు చేస్తున్నవారు సైతం ఉన్నారంటే ఆశ్చర్యం కలుగుతోంది. మరోవైపు విద్యార్థులకు కనీస సౌకర్యాలు కూడా హాస్టళ్లలో కానరావడం లేదు.

జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ కలిపి ఎస్‌సి వసతి గృహాలు 28 ఉన్నాయి. వీటిలో 1879 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 35 బిసి సంక్షేమ వసతి గృహాల్లో 1733 మంది, 15 పోస్ట్ మెట్రిక్ వసతి గహాల్లో 1856 మంది విద్యార్థులు ఉన్నారు.

ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లోని 3, 4 తరగతుల విద్యార్థులకు రూ.1,150, ఐదు నుంచి 10వ తరగతుల విద్యార్థులకు రూ.1,400 మెస్ ఛార్జీల రూపంలో ప్రభుత్వం చెల్లిస్తోంది. అక్టోబర్ నెల నుంచి మెస్ ఛార్జీలను చెల్లించడం లేదు. దీంతో నాలుగు నెలలుగా జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గహాలు విద్యార్థులకు సుమారుగా రూ.25లక్షలు, బిసి వసతి గృహాల విద్యార్థులకు రూ.52 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. ఓ వైపు సకాలంలో బిల్లులు విడుదల చేయకపోవటం, మరోవైపు, పెరిగిన నిత్యావసరాల ధరలతో ఈ ఛార్జీలు చాలడం లేదని వసతి గృహల నిర్వహణ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులతో అవస్థలు పడుతున్న వార్డెన్లు ప్రభుత్వం సకాలంలో బిల్లులు విడుదల చేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్నామని అక్కడి వసతి సంక్షేమాధికారి వాపోయారు. కొన్ని సార్లు ఫింగర్ ప్రింట్ సమస్యలు, మ్యాపింగ్, కోడ్ సమస్యల కారణంగా నిధులు జమ చేయటం లేదని తెలిసింది. మరికొన్ని రోజులు సిఎఫ్‌ఎంఎస్, బిల్లుల అప్‌లోడింగ్ సైట్ ఓపెన్ కాకపోవడం వంటి కారణాలతోనూ ఆలస్యం అవుతుందని వార్డెన్లు చెబుతున్నారు. ఇలా అనేక కారణాలతో బిల్లులు రాష్ట్రస్థాయికి చేరడం లేదని ఆయా శాఖల్లోని అధికారులు, వార్డెన్లు వాపోతున్నారు. ప్రభుత్వం మూడు లేదా ఆరు నెలలకోసారి నిధులు విడుదల చేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు గోరుచుట్టుపై రోకలి పోటులా మారాయి. గతేడాది కేజీ కందిపప్పు ధర రూ.110 ఉంటే ప్రస్తుతం రూ.160కు చేరింది. మంచినూనె లీటరు(పామాయల్) రూ.69 ఉంటే ప్రస్తుతం ఆ ధర రూ.100కి చేరింది. చింతపండు రూ.180కు, పెసర పప్పు రూ.140కు చేరింది. గ్యాస్ సిలిండర్ రూ.930కి చేరింది. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ పెంచాలని కోరుతున్నారు.

విజయనగరంలోని బాలికల వసతి గృహం

బిల్లులు ఎప్పుడు విడుదల చేస్తారో..!

పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఎప్పుడు విడుదలవుతాయో తెలియని ఆయోమయ పరిస్థితి నెలకొంది. నగరంలోని పలు వసతిగృహాల వార్డెన్లు మూడు నెలలుగా రూ.4 చొప్పున వడ్డీకి తెచ్చి హాస్టళ్లను నడుపుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఈ నెల అప్పు కోసం వెళితే 'ఇచ్చిన అప్పు చెల్లించిన తరువాత కొత్త అప్పు ఇస్తాను' అని చెప్పారని ఆ వార్డెన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో బంగారు ఆభరణాలు కొదువ పెట్టి విద్యార్థులకు భోజనం పెట్టాల్సి వస్తుందని వాపోయారు. మరోవైపు ప్రభుత్వం చెల్లించే ధరకు.. బయట మార్కెట్లో ఉన్న ధరకు భారీ వ్యత్యాసం ఉండడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని అంటున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఉన్నతాధికారులు ఎక్కడ బాధ్యులను చేస్తారోనని ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వార్డెన్లతోపాటు, విద్యార్థులు కోరుతున్నారు.

వికలాంగుడికి ట్రై సైకిల్ అందజేస్తున్న పట్టాబి, శ్రీనివాసరావు

వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి ఇఐడి ప్యారి ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో వికలాంగులకు ట్రై సైకిళ్లు, వృద్ధులకు వాకింగ్ స్టిక్స్, వాకర్స్, బేసిన్‌లను సర్పంచ్ బుడుమూరు పట్టాభి, మండల విప్ ఎం.శ్రీనివాసరావు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్యారి సుగర్స్ యాజమాన్యం రేగిడి మండలంతో పాటు వంగర, సంతకవిటి, రాజాం మండలాల్లో వైద్య సేవలతో పాటు వికలాంగులకు, వృద్ధులకు, డఫ్ అండ్ డమ్ వారికి పరికరాలు అందించడం సంతోషిదాయికమన్నారు. వికలాంగులు తమ అవయవాలు కోల్పోయామని చింతించకుండా సమాజానికి ఉపయోగపడేలా తయారు కావాలన్నారు. మురుగప్ప సంస్థ సీనియర్ ఎవి పి.పట్టాభిరామిరెడ్డి, హెచ్‌ఆర్ హెడ్ అండ్ మేనేజర్ మురళీకృష్ణ మాట్లాడుతూ తమ సంస్థ పేదలు, వికలాంగులు, వృద్ధులను ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాయపురెడ్డి కృష్ణారావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాయకులపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి - భోగాపురం

ఎన్నికల నేపథ్యంలో పలు పంచాయతీలకు చెందిన రాజకీయ నాయకులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత రెండు రోజుల నుంచి తహశీల్దార్ చింతాడ బంగార్రాజు ఈ కేసులను నమోదు చేస్తున్నారు. ఎన్నికల వేళ ఎటువంటి వివాదాలకు పాల్పడిన సరే వీరి పైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని 22 పంచాయతీల్లో ఉన్న టిడిపి, వైసిపి, జనసేన, కాంగ్రెస్ పార్టీలలో నాయకులుగా కొనసాగుతున్న వారందరి పైన ఈ కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో తహశీల్దార్ కార్యాలయం నాయకులు కార్యకర్తలతో కిటకిటలాడుతోంది. సుమారు 200 మంది పైనే కేసులు నమోదు చేసినట్లు తెలిసింది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎ ప్లస్ గ్రేడ్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ ఎ ప్లస్ గ్రేడ్ లభించినట్లు ప్రిన్సిపల్ సిహెచ్ కేశవరావు తెలిపారు. ఇటీవల నాక్ బృందం వచ్చి పరిశీలించినట్లు చెప్పారు. గ్రామీణ గిరిజన ప్రాంతంలోని ఎస్.కోట కళాశాలకు మంచి గ్రేడ్ ప్రకటించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని తెలిపారు. దీని కారణంగా భవిష్యత్తులో విద్యార్థులకు మరింత ప్రయోజనాలు చేకూరుతాయని చెప్పారు.

గ్రామస్తులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి- చీపురుపల్లి

మండలంలోని చిన్న నడిపల్లి సర్పంచ్ గడె సత్యవతి కుటుంబ సభ్యలతో కలసి కొంత మంది గ్రామస్థులకు బట్టలు పంపిణీ చేశారు. సంక్రాంతిని పురష్కరించుకొని శనివారం సుమారు 300 మంది మహిళలకు చీరలు, గాజులు పంపిణీ చేశారు. సుమారు 200 మంది మగవారికి షర్టులు,తువ్వాళుపంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గడే మోహనరావు, గ్రామస్తుల పాల్గొన్నారు.

నేత్రదానం ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

ఆయన నేత్రాలు సజీవం

ప్రజాశక్తి- చీపురుపల్లి

మండల కేంద్రానికి చెందిన సూరి నాగరాజు (35) గుండె పోటుతో శనివారం మృతి చెందాడు. మృతుని నేత్రాలను దానం చేసేందుకు ఆయన తండ్రి సూరు నర్శింహమూర్తి ముందుకు వచ్చారు. ఈ మేరకు స్థానిక మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బివి గోవిందరాజులు ఆధ్వర్యంలో విజయనగరానికి చెందిన రెడ్ క్రాస్ సంస్థ టెక్నిషియన్స్ భాస్కరరావు, శ్రీనులు మృతుని నేత్రాలను సేకరించారు.

క్రికెట్ విజేత వెంకంపేట

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని దేవుదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీల్లో వెంకంపేట సచివాలయం విజేతగా నిలిచింది. వెంకంపేట, మునకలవలస సచివాలయాల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ లో వెంకంపేట విజయం సాధించింది. విజేతలకు చాటాయివలస పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర నాయుడు, పిఇటి చక్రధర్, పీడీలు, షీల్డ్ అందజేశారు. వీరు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రకటించారు.

డాక్టరేట్ పట్టా అందుకుంటున్న అధ్యాపకులు ఈరన్న

ఈరన్నకు డాక్టరేట్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకులు గొల్ల ఈరన్నకు డాక్టరేట్ లభించింది. శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలో కామర్స్‌లో విశ్రాంత ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ పర్యవేక్షణలో ఎన్ఎస్ఇ, నిఫ్టీ స్టాక్‌ల అధ్యయనంలో 'స్టాక్ ధర కదలికల గురించి, రాబడి, నికర ఆదాయం కీలక పనితీరు, వాటి సూచికల అంచనా సామర్థ్యం' అనే అంశంపై ఈరన్న పరిశోధన చేశారు. దీనికి గాను ఈరన్నకు పిహెచ్‌డి ప్రదానం చేశారు. ఈరన్నకు ప్రిన్సిపల్ కేశవరావు, అధ్యాపకులు సిహెచ్ శ్రీనివాసరావు, వాసుదేవరావు, ఎం.రమేష్‌కుమార్, డాక్టర్ వి.సుధీర్, డాక్టర్ రవీంద్ర నాథ్, ఆర్.శ్రీలక్ష్మి, వాలీఖాన్, పి.భాస్కరరావు జి.సురేష్, కె అప్పలరాజు, డి.హైమావతి, డాక్టర్ ఎ.ప్రసాద్, యువిఎస్ఎన్ రాజు అభినందనలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను పరిశీలిస్తున్న బృందం

ప్రకృతి సాగు పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేస్తున్న పంటలను పది రాష్ట్రాలకు చెందిన బృందం శనివారం పరిశీలించింది. బొద్దాంలో ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ స్టాల్స్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా వారికి ప్రకృతి సాగుపై ఎపిసిఎన్ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ ఎం.ఆనంద్ వివరించారు. కార్యక్రమంలో రీజినల్ కోఆర్డినేటర్ కృష్ణారావు, సభ్యులు ప్రకాశ్, హేమసుందర్, తదితరులు పాల్గొన్నారు.

చుక్కమాంబ జాతర ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని అరిగిపాలెంలో శనివారం చుక్కమాంబ జాతర సందడి ఆరంభమైంది. జాతర సందర్భంగా నిర్వహించిన మహిళా కోలాటం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపిటిసి, ఉప సర్పంచ్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు తక్షణమే చెల్లించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎ.సదాశివరావు డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన ఎపిటిఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పి జిపిఎస్ తేవడం అన్యాయమన్నారు. ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు ఎన్.వి పైడిరాజు, పువ్వల ధనుంజయరావు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో శనివారం టిడిపి నిర్వహించిన రా..కదలిరా.. బహిరంగ సభకు విచ్చేసిన ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడును టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.
- ప్రజాశక్తి, వేపాడ

విజేతగా నిలిచిన విశాఖపట్నం జిల్లా జట్టు

వాలీబాల్ పోటీల విజేత విశాఖ

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ పరిధిలోని దత్తిలో మరిడిమాంబ అమ్మవారి జాతర సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీలో విశాఖపట్నం జట్టు విజేతగా నిలిచింది. జగన్ పాత్రుడు (పండు) మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఇందులో తూర్పు గోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జట్లు ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాల్లో నిలిచాయి. వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి టి.వి. భగవాన్ దాస్, జిల్లా అధ్యక్షులు గవర సూరిబాబు, కార్యదర్శి కె.వి.ఎ.ఎన్.రాజు, కోశాధికారి కె.సన్యాసినాయుడు, జాయింట్ సెక్రటరీ కె.క్రిష్ణంరాజు, వైజాగ్ ఎస్.జి.ఎఫ్ మాజీ సెక్రటరీ ఎ.శేఖర్ పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. పోటీలకు రిఫరీలుగా పాల్టేటి శ్రీను, ఎల్.జి.ఎన్.కుమార్, శేఖర్, జగదీశ్, కామేష్ వ్యవహరించారు. విజేతలకు నగదు బహుమతులు అందించారు. ఎల్.జి.ఎన్.కుమార్‌ను వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

కులగణన సర్వే పరిశీలన

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో కులగణన సర్వే విస్తృతంగా సాగుతోంది. మండల కేంద్రంలో సచివాలయం-2లో చేపడుతున్న సర్వేను శనివారం ఎంపిడిఒ రమామణి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సిబ్బంది రవి శ్రావణ్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు , తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలను శుభ్రం చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని ఖాళీ స్థలాలను శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని శనివారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఖాళీ స్థలాల్లో ఉన్న చెత్తను పారిశుధ్య కార్మికులతో ఏరివేయించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కుల గణన సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో పరిశోధన, పరిశోధనా పత్రాల తయారీ అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యశాల శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ రానున్న కాలంలో ఇదే ఒరబడిని కొనసాగించాలని కోరారు. ప్రతి అధ్యాపకుడు పరిశోధనా పత్రాల తయారీలో పాల్గొని తమ వ్యక్తిగత నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. నాక్ ర్యాంకింగ్‌కు ఈ పరిశోధనా పత్రాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ విజయ్ బాబు, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డీన్లు ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డాక్టర్ సన్నీడియోల్, ప్రొఫెసర్ మురళీ, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

బాడంగి : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు 241 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ దత్తి సత్యనారాయణ, సెంటర్ లెవెల్ అబ్జర్వర్ ఎల్.బాపు జవహర్ తెలిపారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

ప్రజాశక్తి-గంట్యాడ

కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య తెలిపారు. శనివారం కె.తామరాపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న కొటారుబిల్లి జంక్షన్‌లో ఆసరా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం నుండి మహిళలను కదిలించి సమావేశానికి తీసుకురావాలని ఆయన సూచించారు. పేదల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం క ట్టుబడి ఉందన్నారు. సమావేశంలో ఎంపిపి పీరుబండి హైమావతి, జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి, వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పి.జైహింద్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు లచ్చిరెడ్డి కృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు రంది రామునాయుడు, సీనియర్ నాయకులు నారాయణ మూర్తి రాజు, చౌడువాడ రామసూర్యం పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

ఎన్నికలకు సమాయత్తం కావాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాబోయే ఎన్నికలకు వైసిపి శ్రేణులు సమాయత్తం కావాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్ బాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజవర్గ స్థాయిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి శ్రేణులను సమాయత్తం చేసేందుకు ఈనెల 27వ తేదీన భీమిలి నియోజకవర్గంలో జరగబోయే సభకు తరలి రావాలన్నారు. ఈ సమావేశంలో నియోజక వర్గం పరిశీలకులు అందవరపు సూరిబాబు, ఎంపిపి అంబళ్ళ సుధారాణి, జడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి అంబళ్ళ శ్రీరాములు నాయుడు, మండల పార్టీ ప్రెసిడెంట్ చనమల్ల రమణ, నగర పంచాయతీ చైర్మన్ బంగారు సరోజిని, వైస్ ఛైర్మన్ సముద్ర రామారావు, కారుకొండ కృష్ణ, పార్టీ ప్రెసిడెంట్ చిక్కాల సాంబ శివరావు, పూసపాటి రేగ ఎంపిపి మహంతి కల్యాణి, జడ్‌పిటిసి మహంతి సీతాలక్ష్మీ, వైస్ ఎంపిపిలు చంటి రాజు, వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జిల్లా మత్స్యకార అధ్యక్షులు బర్రి చిన్నప్పన్న, భోగాపురం వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పట్టుబడిన మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్ఇబి అధికారులు

564 మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి - పూసపాటిరేగ, భోగాపురం

పూసపాటిరేగ మండలంలోని తిప్పలవలస గ్రామంలో భారీగా మద్యం సీసాలను భోగాపురం స్పెషల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అనధికారంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో భోగాపురం సిఐ ఎమ్ఆర్‌వి అప్పారావు, ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో వెళ్లి దాడులు చేసి పట్టుకున్నారు. ఈ ఇద్దరు వ్యక్తుల నుంచి 564 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ రామకృష్ణ తెలిపారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

గరికిపేట, గుషిణిలో 79 బాటిళ్లు

నెల్లిమర్ల: మండలంలోని గరికిపేట, గుషిణి గ్రామాల్లో 79 అక్రమ మద్యం బాటిళ్లను పోలీసుల పట్టుకున్నారు. శనివారం గుషిని జంక్షన్‌లో 24, గరికి పేటలో 52 అక్రమ మద్యం బాటిళ్లు పోలీసులు పట్టుకున్నామని ఎస్ఐ డి. రామ గణేష్ తెలిపారు. పట్టుబడిన మద్యం బాటిళ్లు, నిందితుల్ని పోలీసు స్టేషన్‌కి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అక్రమ మద్యం నిల్వలపై పోలీసుల దాడి

రేగిడి: మండలంలోని ఆడవరం, లక్ష్మంపురం గ్రామంలో బెల్ట్ షాపు నడుపుతున్న వ్యక్తి వద్ద అక్రమంగా 40 మద్యం బాటిళ్లను పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అక్రమ మద్యం దారున్ని రేగిడి పోలీస్ స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

పది మంది అరెస్టు

మండలంలోని సోమరాజు పేట గ్రామంలో శనివారం పేకాటాడుతున్న 10 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ. శ్రీనివాసరావు తెలిపారు. వారి నుంచి రూ.3,320 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.